# బాలమిత్ర

పిల్లలకు 'క' నుండి 'వ' వరకు వత్తులు
నేర్పడానికి క్రింది పాట ఎంతగా
తోడ్పడుతుందో వేరే చెప్పాలా?
మరింకేం! ఈ రోజే నేర్పించండి!!

## అక్కకు చుక్కకు ..

అక్కకు చుక్కకు - 'క' వత్తు (్క)
అగ్గికి బుగ్గికి - 'గ' వత్తు (్గ)
అచ్చుకు గచ్చుకు - 'చ' వత్తు (్చ)
గజ్జికి బుజ్జికి - 'జ' వత్తు (్జ)
తట్టకు బుట్టకు - 'ట' వత్తు (్ట)
గెడ్డకు బిడ్డకు - 'డ' వత్తు (్డ)
అత్తకు దుత్తకు - 'త' వత్తు (్త)
సుద్దకు ముద్దకు - 'ద' వత్తు (్ద)
అన్నకు కన్నకు - 'న' వత్తు (్న)
అప్పుకు పప్పుకు - 'ప' వత్తు (్ప)
మబ్బుకు డబ్బుకు -'బ' వత్తు (్బ)
అమ్మకు గుమ్మకు - 'మ' వత్తు (్మ)
గొయ్యికి నుయ్యికి - 'య' వత్తు (్య)
కర్రకు బుర్రకు - 'ర' వత్తు (్ర)
మల్లికి బల్లికి - 'ల' వత్తు (్ల)
గువ్వకు మువ్వకు - 'వ' వత్తు (్వ)

ముద్దు ముద్దు మాటలు మాట్లాడే చిన్నారులకు
క్రింది పాటను నేర్పిస్తే, వాళ్ళు దాన్ని చెప్తుంటే
పొందే ఆనందము స్వానుభవమున తెలుసుకోండి.

## బుజ్జిమేక!

బుజ్జిమేక బుజ్జిమేక ఏడకెళ్తివి?
రాజుగారి దొడ్డిలోన మేతకెళ్తిని.
రాజుగారి దొడ్డిలోన ఏమి చూస్తివి?
రాణిగారి పూలచెట్లు మురిసి చూస్తిని.
పూలచెట్లు చూసి నీవు ఊరకుంటివా?
ఊరుకొనక పూలచెట్లు మేసి వస్తిని.
మేసివస్తె తోటమాలి ఊరకుండెనా?
తోటమాలి కొట్టవస్తె తుర్రుమంటిని.

## కడవ - కాకి

కడవ మీద కాకమ్మా!
కడవ అడుగున నీళ్ళమ్మా!
ప్రక్కన గులకరాళ్ళమ్మా!
ఒకటీ ఒకటీ వేయమ్మా!
క్రిందికి క్రిందికి రాళ్ళమ్మా!
పైకి పైకి నీళ్ళమ్మా!
దాహం తీరా తాగమ్మా!
కావుకావని ఎగురమ్మా!!




